# పరివర్తన

కావిలిపాటి విజయలక్ష్మి

సంధ్యారుణ కిరణాల తాకిడికి ప్రకృతి రాగరంజిత మౌతూంది. హడావుడిగా పెరట్లో ఉన్న కొళాయి దగ్గర కెళ్ళి పశ్చిమ దిక్కువైపు చూసింది అనంతమ్మ.

పడమటి కొండల్లో కృంగి పోతున్నాడు రవి. హరహర మహాదేవ అంటూ కొళాయి క్రింద బిట్టపెట్టి స్నానంచేస్తూ. 'అమ్మాయ్ ప్రమిదలు తడిపావే! ఆముదం కట్టలు తెచ్చారా! నా మతిమండ మైనపువత్తి కావాలేవ్' అరిచినట్టు కేకేసింది. అనంతమ్మ కోడలికి వినిపించాలని.

"అబ్బబ్బ. ఏమిటమ్మా! అన్నీ ఉన్నాయ్ స్నానంచేద్దూ!" విసుక్కున్నాడు అనంతమ్మ కొడుకు రంగారావు.

"నా కొక్కదానికేనేవిట్రా అబ్బాయ్ పండగా! అలా విసుక్కుంటావ్. ఈ పట్నవాసపు కాపురాలకి పండగలేమిట్లే!" ఉదాసీనంగా అంది అనంతమ్మ.

"తెలిసే ఎందుకమ్మా! మరి అన్నీ కావాలంటావ్!" నవ్వుతూ అన్నాడు రంగారావు.

"ఏమిటో ఏం కాలమో! ఏం పిల్లలో. మొన్న వాడూ అంతే! పండగంటిపూట ఆడపిల్లనీ అల్లుణ్ణీ తీసుకురామూ! దసరాకి తీసుకువచ్చాం మళ్ళీ దీపావళికా! నీచాదస్తం నువ్వూ అని కసిరేశాడు. దీపావళి వస్తూంది అమ్మణ్ణి తీసుకురారా అంటేనూ! నాకెందుకు బాబూ?"

"అలా అంటూనే కలుగజేసుకుంటావ్. ఉన్నదాంతో నే సరిపెట్టుకోవాలమ్మా" అన్నాడు రంగారావు. ఆరోజుకి అతని జీతమయిపోయి అప్పులకి తిరిగేసమయం వచ్చేసింది. ఓ పది రూపాయ లెక్కడన్నా అప్పు పుడుతుందేమో! పెద్దది ఆమె నెందుకు నొప్పించాలి. ఏవో ఓ సరుకులు తెద్దామని, తొలిరోజు తెలిసినవార్ని నలుగురైదుగుర్ని అడిగాడు. లాభం లేకపోయింది. రేపెలా వెళుతుందా అని నిజంగా బెంగ పెట్టుకున్నాడు.

సరి. ఉదయంనుంచీ ప్రారంభమయింది గొడవ తెల్లవారుజాము నాలుగ్గంటలకే లేచిన అనంతమ్మ స్నానం జపం ముగించేసరికి భళ్ళున తెల్లవారింది.

"అమ్మాయ్ వంటకేమిటో నాదగ్గర పడెయ్, తెల్లారిపోయింది. రామ్మా తొందరగా," అంటూ కోడల్ని పిలిచింది.

పండగ కనుక పప్పూ, కూరా, చారూ చెయ్యమని ఆ సరుకులిచ్చింది ఆమె కోడలు వరలక్ష్మి.

"అయ్యో, పిండివంటే....!" తెల్లబోయి చూసింది అనంతమ్మ.

"నిన్న చేశారుగా పాయసం. ఎవ్వరికీ ఆరోగ్య మంతగా బాగుండలేదు...." నసిగింది వరలక్ష్మి. నిన్న భర్తకి ఎక్కడా అప్పు పుట్టలేదని తెలుసామెకు. పండగని ఇవ్వాళ ఇంట్లో ఉన్న పప్పూ నూనె వాడేస్తే నెలాఖరుదాకా ఎలా వెళ్ళబుచ్చాలి! అందుకని ఇవ్వాళ పిండివంట మానేద్దామనుకుంది.

'అదేమిటే! నేనున్నాననా! లేకపోతే పండగంటిపూట వాగాయిత్వం ఓడుకుంటూ పిండివంట మానుకుంటారే!" అంది అనంతమ్మ నిష్ఠూరంగా,

ఆ మాటకు నొచ్చుకున్న వరలక్ష్మి కాస్త శనగపప్పు తెచ్చి అత్తగారి ముందుంచి. "ఇదిగో—అయితే ఏం చేస్తారో చెయ్యండి?' అంది.

"ఈ పప్పు ఏంసరిపోతుందే! నలుగురం తలో ముక్కాతినొద్దూ! దివ్వకొట్టి తీపతినరూ!'

'సరిపెట్టెయ్యండత్తయ్యా. అదే పప్పు ఉంది ఇంట్లో' ఆమె మాట కద్దుగావస్తూ అనేసి వెళిపోయింది వరలక్ష్మి.

"సరిపెట్టెయ్యక నాకా కావాలి. చచ్చే ముండని. నిన్నటికి నిన్నా అలానే అంది. నాలుగు డేగిశాలు నీళ్ళు కాచి నలుగురూ తలంటి పోసుకో్రా! అంటే. 'నాలుగు డేగిశాల నీళ్ల కాగాలంటె ఎనిమిది కుంపట్ల బొగ్గులు కాలాలి. పొయ్యిపెడితే ఇంటావిడ ఒప్పుకోదు. స్టవ్ నీళ్ళంటే అంత నీళ్ళనిమీరే అంటారు. బొగ్గులు బస్తా పదహారు రూపాయలు, కుంకుళ్లు కేజీ మూడున్నర. ఇలా సోది చెప్పింది, ఏదెలా ఉన్నా పండగ మానుకుంటామా! ఏం దరిద్రపు కాల మొచ్చిందమ్మా! పండగంటి పూటా తలంటి పోసుకోరూ! అన్నానో లేదో రామిగాడంటాడూ: 'నీకా బాధలేదుగా మేమెలాగో సబ్బుతో తల కడిగేసుకుంటాం ఊరుకో బామ్మా' అని నా కాలంనాడు ఈ దరిద్రం లేదు బాబూ! తెల్లారగట్ట లేచి పొయ్యి అంటిస్తే తెల్లారేసరికి అందరం నలుగు పెట్టుకు నీళ్ళు పోసుకునేవారం. మాతో సరా. పనివాళ్ళూ, చాకలీ, మంగలీ అందరికీ పిండీ నూనె. కుంకుడుకాయలూ ఇవ్వాల్సిందే! కుంచెడు పప్పోసి బూర్లు వండేదాన్ని. దీపాలు వేళ దాకా పెట్టుబడివాళ్ళు వస్తూనే ఉండేవారు. అలా పంచేదాన్ని పళ్లేల్తో. హవ్వ, ఈ గుజ్జెన్నగూళ్ళ వంటలు నాకు చేతకావమ్మా."

"దీపావళీ వచ్చిందంటే ఇలాగనా! డబ్బాచమురు దీపాలకు కాలాల్సిందే" ఆమె ధోరణి సాగిపోయింది.

మౌనంగా ఉండిపోయారు భార్యాభర్తలు. ఎలాగో సాయంత్ర మయింది.

"అధమం వంద ప్రమిదలన్నా తెప్పించన్నాను. నాలుగంటే నాలుగు తెప్పించింది. అదేమిటే! అవేనా! అంటే వర్తనానికి చాల్లెద్దురూ అంది. వర్తనానికట వర్తనానికి," బట్ట పిడిచి మళ్ళీ చుట్టబెట్టుకుంటూ అంది అనంతమ్మ.

"అంతే నమ్మా మానలేక వర్తనానికి జరుపుకుంటున్నాం పండగలు. కాలం మారింది కరువు లొచ్చాయ్. ఏం చేస్తా

మమ్మా?'' అన్నాడు రంగారావు.

''నీ ఒక్కడికే మారినట్టుంది కాలం. అన్నయ్యింట్లో ఇంత కనికష్టం లేదురా!'' అందామె.

''అన్నయ్య సంగతి వేరు, నాసంగతి వేరు. అన్నయ్యలా నేనేమీ చెయ్యలేను'' అన్నాడు రంగారావు నవ్వుకుంటూ.

అనంతమ్మ కిద్దరు కొడుకులు. పెద్దవాడు ప్రకాశం స్కూళ్ళ ఇనస్పెక్టరు. రెండోవాడు రంగారావు కలెక్టెరాఫీసు గుమస్తా ప్రకాశం ధనార్జన తెలిసినవాడు అతని దగ్గరే తరుచు ఉంటూ ఉంటుంది అనంతమ్మ. అ కోడలు బాగా విసుక్కుంటే ఇక్కడి కొచ్చి నెలరోజు లుంటుంది. ప్రకాశం కూతురు పెళ్ళి చేశాడంటే జీతంలో మిగిల్చి అప్పుతెచ్చి పెళ్లి చెయ్యలేదు. ఆ సంబంధం బాగుంది వాళ్ళెంత కట్నం మడుగుతున్నారు'' అనేసర్కి వారడిగినంత కట్నానికీ కూతురి కా సమ్మంధం రైటు చేశాడేధైర్యంతో నంటే? మేష్టర్ల తలలు, తనచేతిలో ఉన్న మేష్టర్లెందరో లెక్కకట్టాడు. నువ్వింత నువ్వింత తీసుకురండి. నాకూతురి పెళ్ళి చేస్తాను. పందిట్లో చదివింపులు లేవు అన్నాడు, అందర్నీ తలొకసారీ పిలిపించి ఏముంది వసూలయిపోయింది. కట్నం పెళ్లి ఖర్చులూ పోను, కొంత నిలవేశాడు పండగలకి అల్లుడు తగులుతూంటాడని. అంతే కాదు కూతురి పెళ్ళంటే ఎప్పుడో ఒకసారి చేసేది, కాని ప్రతివారం ఒక్కో మేష్టరు అతనికి సంతకూరలు కొనివ్వడం రివాజు. బకాసురుళ్ళావాటాలు వేసేసి అలాతినేస్తున్నా అందరూ అతన్ని ఎరిగున్నవారు ప్రకాశం మంచివాడంటారు. పొంగిపోతుంది అనంతమ్మ.

కొడుక్కి ఫలానా విధంగా ఈ రాబడి వస్తూంది అని తెలియదు అనంతమ్మకి. మా పెద్దాడిది పెద్దజీతం వాడికేం లోపం లేదమ్మా. పాలూ పెరుగూ తింటారు అంటుంది. రంగారావు స్వతహాగా అమాయకుడు. అంటే చాలా పర్యాయపదాలు వాడతారు మనవాళ్లు. చాతకానివాడు, వెర్రివెధవ, అడారి అప్పయ్య అని మంచివాడికి ఇవే బిరుదులనుకోండి. రంగారావుకి లంచం తీసుకోవడం తెలియదు లంచం తీసుకోవడమంటే సామాన్యమైన విషయమా! దానికి ఎన్ని తెలివితేటలు కావాలి. నొప్పించక తానొవ్వక? తీసుకునే లంచమైతే ఇంద్రుడూ చంద్రుడూ కూడా బైటికి లాగుతారు. ఊరికే తినేశాడని అసూయపడి ఏడవడం తప్ప. రంగారావు భయస్థుడు కూడా.

ఇవ్వాళ అన్నీ వెర్రిగానె అనిపిస్తున్నాయి అనంతమ్మకి. ఇంట్లోకి బిందెనీళ్ళు బుజాన్న ఎత్తుకుని వెళ్తూ, ''మా కాలంలో ఎరగనమ్మా: మా నాన్నయితే ప్రతి పండక్కీ కొత్తబట్టలు కుట్టించేవాడు కొత్తబట్టా, పిండివంటా, లేనిదే పండగేవిటి అనేవాడు. ఈ దీపావళి వచ్చిందంటే, షావుకార్ల పేర్లన్నీ వ్రాసి, అనంతం వాళ్ళే వేమిటి తెచ్చారో, పేర్లు కనుక్కుని ఇందులో ఉన్న ఆ పేరు కెదురుగా వ్రాయి. అని నాకిచ్చి వెళ్లిపోయేవాడు. నేనో ముక్క చదివానని మానాన్న కెంత గొప్పో! సాయంకాలమయ్యే సరికి, మతాబాలూ, అగ్గిపెట్టెలూ, ఎన్నో రకాల సామాన్లు బండెడు పోగయ్యేవి, నెల రోజులు కార్తీకం వెళ్ళేదాకా కాల్చేవారం.''

ఆమాటలకి నవ్వొచ్చిన వరలక్ష్మి. మీ నాన్న ఏం ఉద్యోగం చేసేవారత్తయ్యా అని అడిగింది.

'కరిణీకమమ్మా! కరణంఅంటే అరోజుల్లో కలెక్టరులా చెలామణీ అయ్యేవాడు. సర్దుకు తినడాలు. వర్తనానికి పండగలు చేసుకోవడం జన్మెత్తి ఎరుగనే తల్లీ' అంది కోడలివైపు ఉక్రోషంగా చూస్తూ.

తండ్రి కరణం. ఊరుతినేవాడు భర్త రివెన్యూ ఇనస్పెక్టరు గ్రామోద్యోగుల్ని తినేవాడు. వారి హయాంలో ఆమె చేతికి అడ్డు లేదు. ప్రకాశం స్కూళ్ళ ఇనస్పెక్టరు. పిల్లలవాడైనా ఇబ్బందులు లేకుండా ఇల్లు సునాయాసంగా ఈడ్చేస్తున్నాడు. 'సామంతుల దగ్గర కప్పాలు వసూలుచేసి మీసం దుల్పి రాజ్యం ఏలే మహరాజులా ' మాష్టర్ల దగ్గర నెలకెంతా అని మామ్మూళ్ళు వసూలుచేసి రాజాలానే బ్రతికేస్తున్నాడు. కొడుకు తినేది లంచమంటే ఒప్పుకోదు అనంతమ్మ. లంచమని తెలిస్తే మందలిస్తుంది కూడా.

ఓనాటి ఉదయాన్నే ప్రకాశం కొడుకు తల్లితో చెబుతున్నాడు. 'అమ్మా అవధాని మాష్టరు నాన్నకి అరవై రూపాయ లిచ్చాడని ఎవరన్నా మాష్టర్లు గుమ్మంలోకి రాగానె కనిపెట్టి రమ్మని పిల్లల్ని పంపిస్తుంది ప్రకాశం భార్య అలివేలు. 'ఫలానా ఆయన నాన్నకెంత ఇచ్చారు.' అని వాళ్ళద్వారా తెలుసుకుని భర్తలోపలికి రాగానే లెక్కపెట్టి వసూలు చేస్తుంది. భార్యనేమీ అనలేని ప్రకాశం పిల్లల్ని బాదేస్తాడు. వాళ్ళ చేతిలో ఓ రూపాయి పారేసి ఓదారుస్తుంది అలివేలు.


అవధానిగారు అరవై రూపాయ లిచ్చారు అన్నమాట అనంతమ్మ చెవిన పడింది. మహాపాతకమేదో కొడుక్కి అంటినట్టు విలవిలలాడి పోయిందామె మనసు. అడిగేసింది కొడుకుని, వీధిలోకి వెళ్ళ బోతూంటే.

'అబ్బాయ్ అవధానిగారి దగ్గర అరవై రూపాయలు లంచం తీసుకున్నావట. 'వద్దు సుమా! అగ్ని హోత్రంలాటి బ్రాహ్మడు 'విప్రధనముకన్న విషము మేలు ' అన్నారు పెద్దలు ' అని మందలిస్తూ.

ఎటువంటి విషమన్నా అమృతంలా స్వీకరించే శక్తి అ చెయ్యికుందని ఆమె కేం తెలుసు ? మేష్టరెవరన్నా చెయ్యరాని నేరం చేసి ప్రకాశం చెయ్యి తడిపేడంటే క్షమించేస్తాడు. ఆనేరం మరి బయటికిరాదు. లంచమని ఎవరన్నారమ్మా? అతను నా దగ్గర అప్పుతీసుకున్న సొమ్ము ఇచ్చేశాడు. అని అందంగా అబద్దమాడేడు ప్రకాశం.

తండ్రి ఆర్జనా లంచమని ఆమెకు తెలియదు. కరణం ఉద్యోగమే అలా లేసుకోవడం కాబోలనుకునేది, రైతులు గింజలు, షావుకార్లు మామ్మూళ్ళు ఇస్తూంటే.

భర్త ధాన్యం, ఇతర ధాన్యాలూ బస్తాల్లో తెచ్చి ఇంట్లో పొయ్యడం. కోటు జేబులో




నోట్ల కట్టలు కూరి తేవడం, ఇవన్నీ అతని ఉద్యోగంలోని భాగమే అని ఆమె నమ్మింది.

ఈనాడు కొడుకు దోచి పోసేస్తుంటే. అతనిది పెద్ద ఉద్యోగమని ఆమె ఉద్దేశ్యం.

* *

పొత్తిపంచ కట్టి తలమీద ముసుగు వేసుకు చెవి ఇరుకునుంచి మారు పమిట వేసుకుని సుదుటా. జబ్బలమీదా విభూది రేకలు దిద్దుకొని. "అమ్మాయ్ దీపాలకన్నీ అమర్చుకోవాలి, నాకన్నీ పడెయ్యమ్మా" అంది అనంతమ్మ కోడలి వైపు చూస్తూ.

ఏమిటి పడెయ్యాలో? ఈవిడకి తినేస్తుంది దిక్కుమాలిన ఆచారాలు అని మనసులోనే తిట్టుకొని "దేవుడి దగ్గర దీపారాధన చేసి ఆ అరటిపళ్ళు నివేదన చెయ్యండి" అంది వరలక్ష్మి.

"ఆ రెండు అరటిపళ్ళూనా నివేదనా! చలిమిడీ వడపప్పు చెయ్యొద్దూ! చెరకు ముక్కలో! టెంకాయ కొట్టద్దూ! వట్టి అరటి పళ్ళా నివేదన!" అంది అనంతమ్మ ఆమె మనస్సుకేదో కష్టంగా ఉంది. దేవుడికేదో అపచారం జరిగి పోతూన్నట్టనిపిస్తూంది.

చలిమిడికి పిండి అందించలేదు. పెసరపప్పు నిండుకుంది. కొబ్బరి కాయ ఒక్కటే రూపాయి చెప్పారట బజార్లో అందుకని తేలేదు. గొణిగినట్టు చెప్పింది వరలక్ష్మి. చిరాకెత్తింది అనంతమ్మకి. "ఏమికాలం మొచ్చిందే! కొబ్బరికాయ రూపాయా! పోనీ కాసిని బియ్యం అడించకపోయావా!" అంది కసిగా.

ఆమెకు తెలియదు. ఇంట్లో బియ్యం నిండుకున్నాయని, కొడుక్కి ఫీజు కట్టి ఇంటరు మీడియట్‌లో జాయిను చేశాడు. కోమటికొట్టు పద్దు చెల్లించలేదు రంగారావు. మంచి బియ్యం లేవు. ఇవ్వాళ రేపూ అంటూ తిప్పుతున్నాడు షావుకారు. కేజీ రూపాయిన్నర బియ్యం ఖరీదు. కొనలేక కటకటలాడిపోతున్నాడు రంగారావు. తీరా నాటి ఉదయం భార్య కొంచం బియ్యం ఎక్కువ తెండి అని చెబితే ఆమెను తిట్టాడు రంగారావు. "అమ్మ అంటే పెద్దది తనకు తెలియదు. నీకు తెలియవూ పరిస్థితులు? పిల్లలు నయం. దీపావళి సామాన్లు కొనడానికి డబ్బులేదంటే కిమ్మనకుండా ఊరుకున్నారు. ఎక్కడనుంచి తెస్తాను? పండగలకేం వచ్చేస్తాయ్ అందులోనూ మన ఆంధ్రులకు అడుగడుగునా పండగలే. తెచ్చిన బియ్యం పిండీ గట్రా ఆడించెయ్యకు" అంటూ.

భర్తా, అత్తగారూ, ఇద్దరిమధ్యా నలిగిపోతూంది వరలక్ష్మి. లంచాలు మింగే ఆఫీసరు భార్యనన్నా కావాలి. కూలీ నాలీ చేసి బ్రతికే కులంలోనన్నా పుట్టాలి భగవాన్, ఈ మధ్యతరగతి కుటుంబంలో పుట్టకూడదు పడకూడదు అనుకుని కళ్ళనీళ్ళు నింపుకుంటుంది వరలక్ష్మి.

ఉత్త అరటిపళ్ళు నివేదన చెయ్యబోతూన్న అనంతమ్మ కెందుకో కోపం వచ్చింది. "ఈ దరిద్రగొట్టు వెధవకాలం వచ్చి పడింది నాయనా. ఇవ్వాళ నీ కింతే ప్రాప్తి" అంటూ దేవుడికి కసిగా దణ్ణం పెట్టింది.

"గుగ్గిలం మైనపువత్తీ ఉన్నాయా! అవీ తేలేదా!" ఉక్రోషంగా ప్రశ్నించింది అనంతమ్మ.

"మేమైతే ఎలాగోలా పండగ అయిందనిపించేస్తాం. అమ్మతో గొడవ అంటూ పట్టుపంచ కట్టుకుని గుగ్గిలప్పొట్లాం, మైనపు వత్తీ పట్టుకువచ్చాడామె దగ్గరకు రంగారావు.

"హరహర అనలే దేవిడ్రా! మరచిపోయావా! అలా మూతిముడుచుకు లేచావు. అపచారం కదూ!" అంది అనంతమ్మ. మౌనంగా గుగ్గిలంవేసి వెళిపోతూన్న కొడుకు వైపు ఉదాసీనంగా చూస్తూ.

మరచిపోవడ మేమిటి! మధ్యతరగతి కుటుంబీకుని పాలిట పిశాచాల్లా పండగలొస్తూంటేనూ! అందులోనూ యిది డబ్బు తగలేసే పండగ అనిపించింది రంగారావుకి. ఆ తగలెయ్యడంలో ఏదో సంతోషం, సాంప్రదాయాల్ని నిలబెట్టేమనే తృప్తీ మిగులు.

"ఆముదం కల్పాలేవే వరలక్ష్మీ" అది



గింది అనంతమ్మ.

"దొరకలేదత్తయ్యా." వరలక్ష్మి జవాబు.

"సరె ప్రమిద ఇలా తగలెయ్యి."

మౌనంగా ప్రమిదలు తెచ్చింది వరలక్ష్మి నాలుగు ప్రమిదల్లో చమురు పోసి వత్తులు వెలిగించి తమకున్న గదీ, వంటింటి గడపల్లో ఉంచింది, అనంతమ్మ.

రంగారావుకి పెళ్ళికాని ఇరవయ్యేళ్ళ కూతురూ, ఇంటరుమీడియట్ చదివే పదహారేళ్ళ కొడుకూ ఉన్నారు. వాళ్ళనుద్దేశించి. "ఏమర్రా అలా నిల్చుండిపోయారు. గుగ్గిలం వేశారుకదా! మతాబాలు కాల్చండి." అంది అనంతమ్మ నవ్వుతూ.

"మేమేం చిన్న పిల్లలంఏమిటి బామ్మా!" అని నవ్వారు వాళ్ళు.

"అయ్యో చిన్నా పెద్దా ఏమిటి బాబూ! కాల్చడానికి" అందికాని. అప్పటికామె కవగాహన అయింది. పెద్ద కొడుకెప్పుడూ డబ్బుకి ఇబ్బంది పడడు. గాని రంగారావుకి అర్థిక ఇబ్బందిలేని రోజుండదు. ఆమె మనస్సు ద్రవించింది. చప్పున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పాపం వేదిచుకు తిన్నానుకదూ! ఇవ్వాళ పాపిష్టి ముండని. అని తనను తాను తిట్టుకొని నేనిస్తాను డబ్బు బజారు కెళ్ళి ఏమన్నా తెచ్చుకు కాల్చుకోండర్రా అంటూ కళ్ళ జోడుపెట్లో దాచిన పది రూపాయల ఇస్తూ. మీ పెదనాన్న నే వచ్చేటప్పుడు ఇచ్చాడు అంది అనంతమ్మ.

లాక్కున్నట్టు ఆమె చేతిలో కాయితం తీసుకొని "టెక్స్టుబుక్కు ఒకటి కొనుక్కొంటా బామ్మా" అన్నాడు రామం

"అయ్యో ఏంపాపిష్టి కాలమొచ్చింది రాబాబూ! ఇద్దరు పిల్లల తల్లినయాక కూడా అగ్గిపెట్టెలకి తమ్ముళ్ళతో తగువులాడేదాన్ని మీ సరదాలెలా చంపేసుకున్నారు. సచ్చాయిరా. పాడు కాలంకాకపోతే అంటూ డాబామీది కెళ్ళింది అనంతమ్మ ఎవరన్నా వెలిగించేదీ పాలు మందుగుండు సామానూ చూడాలనే కుతూహలంతో. ఆమె వెనుక మనవ లిద్దరూ ఎక్కారు.


ఎక్కడెక్కడో ధన్ ధన్ మని తాటాకు కాయలూ, బాంబులూ పేలినశబ్దం వినిపిస్తూంది. నాలుగు డాబాలమీద నూనె దీపాలు తోరణాల్లా మెరుస్తున్నాయి. అటువైపు చూపిస్తూ" సుందరీ 'అదెవరిల్లు' అని ప్రశ్నించింది మనవరాల్ని.

"ప్లీడరుగారు, సబ్ ఇనస్పెక్టరూ, డాక్టరూ, ఎ.సి.టి.ఒ. గారి ఇళ్ళని" చెప్పింది సుందరి.

"బాగా ఉన్నవాళ్లా!" అని అడిగింది అనంతమ్మ.

"అహ. బాగా ఉన్నవాళ్ళని తినేవాళ్ళు" అంది సుందరి.

"ఎందుకే ఉడుకుమోతు కబుర్లు. ఏన్ను సంపాదించి తినవద్దన్నారా! మనకి చాతకాదు ఇలా ఉన్నాం. వాళ్ళుచేతయిన వాళ్లు. దర్జాగా




బ్రతుకుతున్నారు.'' అన్నాడు రామం.

''ఏమిటోనర్రా. ఓ సంవత్సరం ఉన్న కలివిడి మరు సంవత్సరం ఉండడంలేదు. నా చిన్నప్పుడు ఈ పండగ వచ్చిందంటే మాపల్లెలో ఎంత ఇదిగా చేసుకునేవారం. ప్రతి పండక్కీ ఆడపిల్లా అల్లుడూ రావాల్సిందే, తెల్లారగట్ల లేచే వాళ్లమనుకో పెద్దాళ్ళు స్నానంచేసి మడిగట్టుకు వంటకి సిద్ధమయ్యేవారు. ఎంతెంత వంటలు! ఎన్ని పిండివంటలు చేసేవారు? పనివాళ్లూ పాలేర్లూ., పంచేసరికి చేతులు పీకేవి. నాలుగు ప్రమిదల్లో దీపమా? ఈరోజున మానాన్నకి కుమ్మరి పోలయ్య దీపావళి నాటి ఉదయాన్నే ఐదు వందల ప్రమిదలు పంపేవాడు."

''ఓ కొనేవాడా బామ్మా! మీనాన్న?'' కొంటెగా నవ్వుతూ అడిగింది సుందరి.

''కొనడమెందుకే విడ్డూరం. మానాన్న కరణం కదూ!'' గర్వంగా నవ్విందిఅనంతమ్మ.

''ఓహో, మీరావేళ తగలెట్టేది మీ డబ్బు కాదన్నమాట ఊరువాళ్ళది."

''ఉత్త పుణ్యానికిచ్చే వారేమిటే అమ్మాయ్ నాన్న ఉద్యోగమో!''

ఫక్కున నవ్వేరు సుందర్ రామం.

''బడవల్లారా. మీ తాత హయాంలో మాత్రం యింత అధ్వాన్నపు పండగ లొచ్చాయా!''

''అదేమిటి బామ్మా! పండగా! ఇప్పటి రోజులా అధ్వాన్నం?'' మళ్లీ నవ్వా రిద్దరూ.

''అవునే అమ్మాయ్. అస్సలీ కరువెందు కొచ్చిందే అమ్మాయ్. ఏవో పుస్తకాలవీ చదువుతూంటారు కదా! ఏమని వ్రాస్తున్నా రందులో. పచ్చగా పప్పూ అన్నం వండుకు తినాలంటే మనబోటివాళ్ళకి భయం. ఎందుకురా బాబూ ఇలాటి పాడుకాలమొచ్చింది?'' అడిగింది అనంతమ్మ. తా నెరిగిన కాలాన్ని వర్తమానాన్ని పోల్చి బాధగా.

''జనాభా పెరిగిపోతూంది బామ్మా!'' అన్నాడు టక్కున.

''పో బడవా! రేడియోలా నువ్వూ అదే మాట చెపుతావ్ వెనుకటికెవరో సామెత చెప్పార్లే. అలాగ తపస్సు చేస్తేమాత్రం పుట్టని వాళ్ళకి పుట్టించగలరురా మీ డాక్టర్లు. ఆకాశపంట ఆపు చేస్తున్నారుగాని.''

''ఆకాశపంటే ఎక్కువైంది బామ్మా! నా ప్రశ్నలకి సమాధానం చెప్తావా!'' అడిగాడు రామం కొంటెగా.

''ఏమిట్రా అడుగు!'' అందామె ముసిముసి ముసిగా నవ్వుకుంటూ.

''మీ అమ్మా నాన్నకూ మీ రెంతమంది పిల్లలు?'' అడిగాడు.

''ఓరి పిడుగా. ఎందుకురా! ఎనమండుగురం.''

'అందులోంచి ఇద్దర్ని తీసెయ్ ఆరుమంది జనాభా పెరిగింది. ఆరు జోడీలనుకో వారికి ఒక్కొక్కరికీ ఎంతమంది పుట్టారు?''

''నా కైతే ఇద్దరేకాని. గొడ్డువాళ్ళు మాత్రం లేర్రోయ్ నా చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ పదేసిమందిని కన్నారు.''

''అయ్ బాబోయ్. నా లెక్కప్రకారం నలభై మంది అధికమయ్యారు. ఇద్దరికి సరిపోయే ఆహారం ఇంతమంది పంచుకు తినాలంటే కరువుకదూ బామ్మా! అస్సలలా మీరు పిల్లల్ని కనెయ్యబట్టి. మేం దరిద్రుల మయ్యాము. మేముకూడా మీలా కనేస్తే ఇంకోవంద సంవత్సరాలకి మనిషిని మనిషి తినక తప్పదు.''

''ఛ. తప్పు, అలాటి మాట్లాడకు. ''మందలించింది'' అనంతమ్మ.

''అదికాదు బామ్మా ఇద్దరు తినేది నలభై మంది తినాల్సివస్తే. నువ్వు తుంచెడు పప్పు బూర్లూ. డబ్బానూనె దీపాలూ అంటే ఎలా!'' అంటూ నవ్వుతూన్న మనవలవైపు చూస్తూ. ''మీకేం తెల్పర్రా! దీపావళి ఎంత మంగళకరమైన పండగో'' అంది అనంతమ్మ.

———